సిపిఆర్ విధానంతో ప్రాణాలు కాపాడవచ్చు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: అత్యవసర పరిస్థితిలలో ప్రమాదాలకు గురైన, అనారోగ్యం పాలైన వ్యక్తులను సిపిఆర్ విధానంతో ప్రాణాలు కాపాడవచ్చునని సంతబొమ్మాళి ఆయుష్ వైదశాల డాక్టర్ మోహనరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్లే ముందు సిపిఆర్ విధానం చేస్తే తగిన ఫలితం ఉంటుందని డాక్టర్ వివరించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులకు, విద్యార్థులకు సిపిఆర్ విధానం ఎలా చేయాలో ప్రత్యక్ష పద్ధతి ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, వైద్య సిబ్బంది శ్రీనివాస్‌రావు భాగ్యవతి, చిన్నమ్మడు, హైమావతి, గణేష్, ఉమా, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబును కలసిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: శాసన మండలి సభ్యులు కొణిదల నాగబాబును జిల్లా కలెక్టర్

స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. గురువారం శ్రీకాకుళం నగరంలో పర్యటన సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సందర్శించిన అనంతరం శాసన మండలి సభ్యులు ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకున్నారు. అనంతరం జిల్లా విషయాలపై చర్చించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

విద్యారంగ సమస్యల పరిష్కారానికై 22 నుంచి బస్సు జాతా
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం

విశాలాంధ్ర - పలాస: రాష్ట్రంలో గల ప్రభుత్వ వైద్యశాలలను పిపిపి పేరుతో ప్రైవేట్ చేయడం ఆపాలని, గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ బాధ్యత వహించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగు బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం పలాస ప్రెస్ క్లబ్‌లో బస్ జాతా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 12 వరకు ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి బస్సు జాత కొనసాగుతుందని తెలిపారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన విద్యార్థుల బ్రతుకులు 20 సంవత్సరాల వెనుకకు వెళ్ళిందన్నారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మరణించారని, 200లకు పైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారని, బుధవారం మరొక విద్యార్థి మరణించినా ఏ ఒక్క అధికారి గాని

స్థానిక ప్రజా ప్రతినిధులు గాని స్పందించకపోవడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య విద్యను పేదలకు అందజేయాలనే ఆలోచన ఉంటే నారాయణ ,గీతం,విట్ కళాశాలలో పిపిపి విధానం అమలు చేయాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో మూతబడిన 4111 ప్రభుత్వ పాఠశాలలు తెరిపించాలని, యూనివర్సిటీలో నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవి కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సాయి ఏఐఎస్ఎఫ్ పలాస పట్టణ నాయకులు సోమేశ్, కిరణ్, నితిన్, విజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు

- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వ నిర్వహించిన డీఎస్సీలో శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో ఉపాధ్యాయులుగా నియమతులైన నూతన ఉపాధ్యాయులకు బుధవారం నగరంలోని ఓ హెటల్లో ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంపిక కావడం సమాజంలో ఒక గౌరవం అని, నవ సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతంగా పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులుగా

పేరు ప్రఖ్యాతలు సాధించాలని సూచించారు. 150 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను సూపర్ సక్సెస్ చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పెద్దలు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది...రక్షణ కల్పించండి...

- భూ ఆక్రమణ చేసిన విక్రమ్
- పార్టీ పేరు చెప్పి బెదిరింపులు
- చింతు విజయ ఆవేదన

విశాలాంధ్ర - ఆమదాలవలస: తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి, చంపుతామని బెదిరిస్తూ స్థలాన్ని దురాక్రమణ చేస్తున్న అంపిలి విక్రమ్ నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని చింతు విజయ ఆవేదన చెందారు. సర్వేనెంబర్ 42/1లో ఉన్న 20 సెంట్లు ఖాళీ భూమిని దురాక్రమణ చేసి మా స్థలంలో హోటల్ నిర్మించారని, అంతేకాకుండా కారుకు షెడ్డు కూడా వేశారని ఆమె తెలిపారు. గురువారం స్థానిక కళ్యాణ మండపంలో మాట్లాడుతూ జనసేన పార్టీ పేరు చెప్పి బెదిరిస్తున్నారని ఆ స్థలం పత్రాలన్నీ తమ వద్ద ఉన్నప్పటికీ అవి ఫేక్ డాక్యుమెంట్లని రౌడీలతో కొట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తమ స్థలంలో ఎందుకు ఈ నిర్మాణాలు చేపట్టారని నిలదీస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన చెందారు. బూర్జ మండలం రెవెన్యూ అధికారులు స్థల పరిశీలనకు వచ్చినప్పుడు వారిపై పెట్రోల్ పోసి అక్కడి నుండి తరిమేసిన ఘటన స్థానికులకు తెలుసన్నారు. స్థల వివాదం పరిష్కారానికి సరైన పత్రాలతో పెద్దల ముందుకు రావాలని విన్నవించినప్పటికీ ఇక్కడికి వచ్చే పెద్దలు ఎవరు అంటూ వారిని సైతం దూషిస్తున్నారని తెలిపారు. సర్వే నెంబర్ 42-1లో ఉన్న 20 సెంట్లు భూమి పొట్నూరు పార్వతీసానికి చెందినదని, తాత నుండి వారికి దఖలపడిందని వారి వద్ద నుంచి 2023లో కొనుగోలు చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్ పత్రాలతోపాటు వన్ బిఎస్ఎల్ఆర్‌లో నంబర్లు విలేకరులకు చూపించారు. అధికారులతో వెళ్లినప్పటికీ తమను బెదిరిస్తున్నారని కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉంటుండగానే ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టి అడ్డుకున్న మాపై దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయారు. కోర్టు ఇచ్చిన అనుమతి పత్రంతో ఆ స్థలంలో ఉన్న షెడ్డును రెండు రోజుల క్రితం తొలగించామని దీనిపై మమ్ములను హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రవికుమార్‌కి విషయాన్ని వివరించామని స్థలం డాక్యుమెంట్ల మేరకు ఎవరిదైతే వారే తీసుకోవాలని, నా నియోజకవర్గంలో భూ తగాదాలు వద్దని ఎమ్మెల్యే తెలిపారని అన్నారు. అయినప్పటికీ అతను మాపై విరుచుకు పడుతున్నాడన్నారు. దౌర్జన్యంగా మా భూమిని ఆక్రమించింది కాక మా కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారని వివరించారు. అందుకు తమ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.

నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

- గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలని నవంబర్ 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు టి.తిరుపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ (ఏఐటియుసి అనుబంధ) యూనియన్ నాయకులు గాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో గత రెండు సంవత్సరాలుగా చనిపోయిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఔట్సోర్సింగ్ విధానంలో ఉపాధి కల్పించాలన్నారు. 12వ పి.ఆర్.సిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. డైలీ వేజ్ కార్మికులను ఔట్సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు సత్వరం విడుదల చేయాలని, ప్రస్తుతం మున్సిపల్ కార్మికులకు సంబంధించి ఉన్న బ్యాంక్ ఖాతాలను బలవంతంగా యాక్సిస్ బ్యాంకులోకి మార్చవద్దన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇల్లు ఇళ్ల స్థలాల కేటాయించి మున్సిపల్ కాలనీలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్. పార్థసారథి, ఆర్. గణేష్, పి.సురేష్, రామచంద్ర, రసూల్, తంగి. నారాయణ రావు, పుష్ప, సీతయ్య, ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి వెళ్లి చెత్తను సేకరించండి

- టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి రమణ

విశాలాంధ్ర-హిరమండలం: మేజర్ గ్రామ పంచాయతీ హిర మండలం పంచాయతీ పరిధిలోని ప్రతీ ఇంటికి ఉదయం వెళ్లి తడి పొడి చెత్తను వేర్వేరుగా తీసుకోవాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐవి రమణ అన్నారు.

గురువారం హిర మండలం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రం షెడ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఐవిఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించుటకు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గోవిందరావు, ఈఓ మూల భాస్కర్‌రావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కవిటి: కవిటి మండలం జమేదారు పుట్టుగ గ్రామం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వి.రవి వర్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జమేధారు పుట్టుగ జాతీయ హైవేపై ద్విచక్ర వాహనంపై టెక్కలి నుండి ఇచ్చాపురం మండలం సంతపేట గ్రామంలో ఉన్న తన బావమరిది పెంద్ర ముఖేష్ ఇంటికి టీవీఎస్ రైడర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వాడపల్లి శ్రీను(39) ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108లో ఇచ్చాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మృతుడు స్వగ్రామం టెక్కలి (ఆది ఆంధ్రవీధి)కి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. మృతునికి భార్య దుర్గమ్మతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై వి.రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొబ్బరి నారుమడి క్షేత్రం పరిశీలన

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం యర్ర గోవింద పుట్టుగలో గల శ్రీ రాధే శ్యామ్ కొబ్బరి నారుమాడి క్షేత్రాన్ని పిఏసిఎస్ అధ్యక్షుడు యర్ర బాసుదేవ్ ప్రధాన్ గురువారం సందర్శించారు.

రైతులకు కావలసిన కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అలాగే వచ్చే ఏడాది కోసం కూడా విత్తన కాయలు నాటడం జరిగిందని వచ్చే ఏడాది కూడా ఈ నారు మడిక్షేత్రం ద్వారా కొబ్బరి మొక్కలు విక్రయానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈపరి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దివీస్‌లో 28 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జెకెసి ఆధ్వర్యంలో గురువారం దివీస్ ల్యాబరేటరీస్ లిమిటెడ్ వారు జాబ్ మేళా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 78 మంది పాల్గొనగా 28 మందికి కంపెనీ నియామక పత్రాలు అందజేసినట్లు ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకి ఇది ఒక మంచి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో జెకెసి కోఆర్డినేటర్ ల్యూక్ పాల్, కంపెనీ ప్రతినిధులు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం

తహశీల్దార్‌కు, వైస్ ఎంపీపీకి వాగ్వివాదం
తహశీల్దార్ తీరు పట్ల సర్వత్రా విమర్శలు

విశాలాంధ్ర - కొత్తూరు: మండల సర్వ సభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఒక అధికారిగా తహశీల్దార్ బాలకృష్ణ వైస్ ఎంపీపీ లోతు గెడ్డ తులసి వర ప్రసాద్‌రావు పట్ల దురుసుగా వ్యవహరించడం సరికాదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాల్లో వేదికపై వైస్ ఎంపీపీ కూర్చొవచ్చా? లేదా అన్న అంశం ఒక అదికారిగా తహశీల్దార్‌కు సంబంధం లేనిది. సభ్యులు (ఎంపీటీసీలు) ఎవరైనా ప్రశ్నిస్తే సభను నడిపించే ఎంపీడీఓ సమాధానం చెప్తారు. అంతే గాని వేదికపై నుండి తహశీల్దార్ బాలకృష్ణ వైస్ ఎంపీపీ లోతుగెడ్డపై ప్రోటోకాల్ విషయమై వాదనకు దిగారు. దురుసుగా ప్రవర్తించడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. ఇంతలో పోలీస్‌లు వచ్చి సర్దు బాటు చేసారు. తహశీల్దార్ సభ నుండి బయటకు వెళ్లి పోయారు. కాగా వివిధ శాఖల పద్దులపై చర్చలు చేపట్టారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రజా ప్రతి నిధి వైస్ ఎంపీపీ లోతు గెడ్డపై దురుసుగా మాట్లాడిన తహసీల్దార్ బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశం తీర్మానం చేసింది. కాగా సామజిక మాధ్యామాల్లో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తహశీల్దార్ అన్నారు. ఇది తనకు మానసికంగా బాధ కలిగిస్తోందని తహసీల్దార్ బాలకృష్ణ అన్నారు. ఎమా పోస్ట్ చేసే వారిని వదిలేదని లేదని చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సరుబుజ్జిలి మండలం చిగురు వలస గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రారంభించారు. గురువారం చిగురు వలస, కొండవలస, పాలవలస పంచాయతీల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తే భవిష్యత్తులో తీవ్ర ఆరోగ్య సంక్షోభం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో యూరియా కొరత లేకుండా అందించామని, నేడు యూరియా కొరతతో రైతులు తీవ్ర యూరియా సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని, చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందించలేక ప్రభుత్వం అప్రతిష్టపాలైందని తెలిపారు. ఎవరైనా మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ టెండర్ నమోదు చేసినట్లయితే

భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్ళీ అవి ప్రభుత్వ కళాశాలగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మండల జడ్పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల వైసీపీ అధ్యక్షులు బేవర మల్లేశ్వరరావు, వైసీపీ రాష్ట్ర వలంటీర్ల విభాగ రాష్ట్ర కార్యదర్శి అత్తులూరి రవికాంత్, మండల వైసీపీ నాయకులు బొడ్డేపల్లి హరిబాబు, సీపాన ఆదినారాయణ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయండి

విశాలాంధ-టెక్కలి: మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుని శోభారాణి ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో అక్టోబరు 18న జరుగు పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలలో పాల్గొనడానికి 25వేల మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలియజేసారు. నవంబర్ 1న మండల స్థాయిలో, నవంబర్ 23న జిల్లాస్థాయిలో, డిసెంబర్ 12,13,14 తేదీల్లో సైన్స్ సంబరాలు జరుగుతాయని తెలియజేశారు. మండల కన్వీనర్ కే శ్రీనివాస్ జిల్లా ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్ పాలవలస ధర్మారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నివగాంలో వైద్యశిబిరం

విశాలాంధ్ర - కొత్తూరు: శాసనసభ్యులు మామిడి గోవిందరావు, కొత్తూరు మండల వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసి వరప్రసాద్ సూచనల మేరకు కొత్తూరు మండల టిడిపి ఉపాధ్యక్షులు బిల్లింగి సంజీవరావు, ఎంపీటీసీ బిల్లింగి కృష్ణవేణి ఆధ్వర్యంలో నివగాంలో కిమ్స్ హాస్పిటల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలోపెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఇ. సి. జీ. 2డి ఎకో (హార్ట్ స్కాన్), బి పి షుగర్ వంటి ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. డాక్టర్ సలహా మేరకు మందులు తీసుకున్నారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసి వరప్రసాద్‌రావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

104 సంచార వాహనాన్ని ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - హిరమండలం: హిరమండలం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంకు చెందిన 104 సంచార వైద్య వాహనాన్ని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి కె.దినేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా వాహనం మెయింటెనెన్స్ మందులు, లభ్యత, వైద్య పరికరాలు స్థితిగతులను పరిశీలించారు. అనంతరం అంబావిల్లి గ్రామంలో 104 వైద్య శిబిరను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 104 సంచార వాహన పైలెట్ అప్పారావు, డిఇఓ సీతారామరాజు, ఎం ఎల్ హెచ్ పి స్వర్ణకుమారి, ఏఎన్ఎం జ్యోతి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై స్థానికుల ఆగ్రహం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని స్థానిక ఎన్టీఆర్ కాలనీ 5, 6వ లైన్ల వెనుక భాగంలో పోలీస్ స్టేషన్ వెనుక వైపున రోడ్డుకు ఆనుకొని కొత్తగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ పక్కనే అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపడుతుండటంతో నీటిపారుదల వ్యవస్థకు అంతరాయం కలుగుతోందని, కాలనీలో వర్షపు నీరు నిల్వవుతుందని వారు తెలిపారు. అక్రమ నిర్మాణాలను ప్రశ్నించగా కొందరు దాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక ఆర్డీవో మరియు ఎస్ఐలకు సంతకాలతో ఫిర్యాదులు సమర్పించినట్లు కాలనీ వాసులు తెలిపారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాంతా కళ్యాణ్ అనూరాగ నిలయం సందర్శించిన కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: వసతి గృహాలు మన గృహాలు వలే శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. గురువారం శాంతా కళ్యాణ్ అనూరాగ నిలయంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కిచెన్ ను సందర్శించి రేషన్ ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేసే సిబ్బందిని వివరాలు అడిగారు. త్రాగునీరు ఫిల్టర్ పని చేస్తుందా లేదా అడిగి తెలుసుకొని బ్యాటరీ మార్చుతున్నారా లేదా అని అడిగి తెలుకొన్నారు. రూంల్లో ఉన్న వృద్ధుల రూంను పరిశీలించి వారి బాగోగుల గూర్చి అడిగారు. ఆరోగ్యం బాగుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల నుండి ఆశీస్సులు అందుకున్నారు. రూంలో టీవీలు ఒకటి ఏర్పాటు చేయగా మిగిలినవి ఎందుకు పెట్ట లేదని అడుగగా టీవీలు ఉన్నాయని పెట్టాల్సి ఉందని అక్కడ సిబ్బంది వివరించారు. టీవీలు లేకపోతే కలెక్టర్ ఇస్తామన్నారు. అక్కడ ఉన్న హాస్పిటల్ వార్డును సందర్శించి అక్కడ బాగు చేసేందుకు అవసరమైతే నిదులు మంజూరు చేస్తామన్నారు. పిల్లలు గదిని సందర్శించి అక్కడున్న సిబ్బంది నుండి వివరాలను తెలుసుకున్నారు. లోపల శుభ్రంగా ఉంది కాని బయట శుభ్రంగా లేదన్నారు. బయట మీరే ప్రతీ రోజు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అక్కడ ఉన్న రూంలన్నింటిని సందర్శించారు. లైట్లు వెలగడం లేదని సిబ్బంది చెప్పగా వెంటనే ఎలక్ట్రికల్ ఎఈకి ఫోన్ చేసి సాయంత్రం నాటికి లైట్లు వెలగాలని ఆదేశించారు.

22 నెలల వయస్సులోనే చిన్నారి అద్భుత ప్రదర్శన

విశాలాంధ్ర - మందస: సాధారణంగా రెండేళ్లు నిండని పిల్లలు ఆటపాటలతో అల్లరి చేస్తుంటారు. కానీ కేవలం 22 నెలల వయస్సులోనే ఒక చిన్నారి అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ చిన్నారి పేరు మయూరి. ఏకధాటిగా 15కు పైగా శ్లోకాలను స్పష్టంగా ఆలపించి, నోబుల్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. దీంతో పాటు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో సూపర్ టాలెంటెడ్ కిడ్‌ను కూడా సొంతం చేసుకుంది. చిన్నారి మయూరి తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అరుదైన ప్రతిభతో చిన్నతనం నుంచే శ్లోకాలు, పద్యాలు నేర్చుకోవడం ప్రారంభించింది. 22 నెలలకే సంస్కృతంలోని క్లిష్టమైన శ్లోకాలను కూడా అలవోకగా ఆలపించగలిగింది. ఈ అరుదైన ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు, నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థకు దరఖాస్తు చేయగా, సంస్థ ప్రతినిధులు మయూరి ప్రతిభను ధృవీకరించి, ఈ రికార్డును ఆమెకు ప్రకటించారు. మయూరి తల్లిదండ్రులు సీర సంజీవ్(సాఫ్ట్ వేర్ ఇంజనీర్) డా. వడిశ శాంతి (వైద్యురాలు). ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. అయితే వీరి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా మందస మండలం డిమిరియా గ్రామం. తల్లిదండ్రులు ఇద్దరూ తమ బిడ్డకు చిన్నతనం నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తిని కలిగించడం, నిత్యం

శ్లోకాలు నేర్పించడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తాళ్లబద్రలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరిగింది.గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి కాశీబుగ్గ సెక్టార్ లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. నేటి సమాజంలో జరుగుతున్న అత్యాచారాలు, నేరాలు మాదక దవ్యాలపై అవగాహన, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పరిశుభ్రత, పోషకాహారం, సైబర్ నేరాలపైఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే.గోపికృష్ణ, ఉపాధ్యాయురాలు ఎన్ లక్ష్మి, ఎమ్మెస్ కె, సిహెచ్ మనీషా, సూపర్ వైజర్ గంగమ్మ, అంగన్వాడి కార్యకర్తలు తాళబద్ర రమా భాయి, శైలజ, పద్మ, జానకి, జె ఆర్ సి పురం కృష్ణవేణి, శాంతినగర్ జి పుష్పలత, పెంటి భద్ర ఎస్ శాంతి, పద్మనాభపురం అరుణ, కంబుషోలి లలిత తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఘన సత్కారం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం పెద్ద కపాసుకుద్ధి గ్రామంలో వెలసి ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో శ్రీ మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాకారులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కళాకారులకు సత్కరించారు. ఉద్దానంలోని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, కంచిలి మండలాల కళాకారుల పెద్ద ఎత్తున పాల్గొని ఉదయం 6 గంటల నుండి సాయంకాలం 6 గంటల వరకు స్వామి సన్నిధిలో సంగీత లహరి కార్యక్రమం నిర్వహించి, కవిటి మండలం సీనియర్ కళాకారుడు వైలెన్ విద్వాంసుడు బైరెడ్ల మాధవ్ రావు కి మృదంగంలో 30 సంవత్సరాల అనుభవం గల వినోద్ కుమార్కు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థా గౌరవ అధ్యక్షులు లక్ష్మణమూర్తి, అధ్యక్షులు రంగాల జానకిరామరెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, కోశాధికారి కొప్పల హేమంత్, సర్పంచ్ కాయ భీమసేన్, పెద్దలు తోట ధర్మరాజు, పులకల శ్రీరాములు, చలపరాయి ఏకంబరం, కారింగి త్రినాధ్ రెడ్డి, దూట్ల వెంకటేశం, కూర్మారావు దాస్, కోటిపల్లి ఆదినారాయణ, మార్పు నారాయణ రావు, పొందల శ్రీనివాస్, హేమంత్ బాడీత్య, బోర రామారావు, హరి దాస్, లక్కోజీ జీవిత, బధకల జయమ్మ, భవాని ఆచారీ, తాతారావు, ఎర్రయ్య, ఉమా మహేష్, భాస్కర్, ఆలయ అర్చకులు శంకర్, నిరంజన్ దాస్, మైలపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మీ అభిమానమే మటన్ సూప్ విజయం

విశాలాంధ్ర-ఆముదాలవలస: ఆముదాలవలస ప్రజల ఆదరాభిమానాలే మా సినిమా విజయానికి కారణమని మటన్ సూప్ సినిమా టీం కిరణ్ కుమార్ మేడసాని, రామకృష్ణ సనపల, గోవిందరాజ్ నీరుడి లు అన్నారు. గురువారం స్థానిక శ్రీదేవి మహల్ లో మటన్ సూప్ సినిమాను టీం సభ్యులు సందర్శించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ అందరి ఆదరాభిమానాలతోనే ఈ సినిమా రూపకల్పన చేపట్టామన్నారు. టీం సభ్యులందరం కలిసికట్టుగా సమన్వయంతో కష్టపడి ఈ సినిమాను మీ ముందుకు తెచ్చామని వివరించారు. కిరణ్ మేడసాని మాట్లా డుతూ ఆముదాలవలస రావడం ఎంతో ఆనందంగా ఉంద న్నారు. రాజకీయంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన పట్టణంలో తొలిసారి అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వ్యక్తి తను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ప్రతీక ఉందని అన్నారు. సినిమాను ఆదరించిన ప్రేక్షక దేవుళ్లకు రుణపడి ఉంటామని అందరికీ పేరున నమస్కారం తెలిపారు. ముందుగా సినిమా విజయవంతం అయినందుకు టీమ్ సభ్యులతో థియేటర్ యాజమాన్యం సహకారంతో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. సినిమా టీం సభ్యులతో యువత కేరింతల కొడుతూ సెల్ఫీలకు ఉత్సాహం చూపారు. వారు కూడా అందరినీ సాదరంగా అక్కున చేర్చుకొని కర చలనం చేసి సెల్ఫీలు తీసుకున్నారు. మటన్ సూప్ సిని మాను ఆదరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు.

దేశభక్తి క్రమశిక్షణ ఎన్.సి.సి ధ్యేయం

విశాలాంధ్ర-టెక్కలి: యువతరంలో దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం మూర్తిభవించేందుకు ఎన్.సి.సి శిక్షణ తప్పనిసరి అని 14 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శశాంక్ కుష్వహ్ అన్నారు. మండలం లోని నౌపాడ రైల్వే గేటు వద్ద ప్రణవి డిగ్రీ కళాశాలకు నూతనంగా మంజూరైన ఎన్.సి.సి యూనిట్లో అర్హులైన విద్యార్థులతో క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన పురుష, మహిళా క్యాడట్లనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధితో మనం పరుగులు తీయాలంటే క్రమశిక్షణ, అంకితభావం అవసరమన్నారు. ఎన్.సి.సి పూర్తిచేసిన క్యాడట్లకు డిఫెన్స్ అధికారులు గానే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఎన్.సి.సి శిక్షణ పొందిన విద్యార్థులు సమాజంలో ఆదర్శవంతులుగా గుర్తింపు పొందుతున్నారన్నారు. ఎన్.సి.సి 14 ఆంధ్ర బెటాలియన్ సుబేధర్ మేజర్ బల్వంత్ సింగ్, సుబేదార్ జితేంద్రకుమార్, సిహెచ్‌ఎం వి.శ్రీరామమూర్తి, రవికృష్ణ, జి.సి.ఐ కె.త్రిషాలి క్యాడట్ల ఎంపిక పూర్తి చేశారు. ప్రణవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, కళాశాల ప్రిన్సిపల్ నర్తు కృష్ణారావు, ఎన్.సి.సి శిక్షణాధికారి బి.మల్లేశ్వర రావు, కేర్ టేకర్ కొండల రుక్మంగధరరావు, ఎం.మంజుల, సీనియర్ అధ్యాపకులు రామపాత్రుని రామారావు, జి.కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఆటోకాడ్ ట్రైనింగ్ శిబిరం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని ఐతం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆటోకాడ్ ద్వారా మెకానికల్ కాంపోనెంట్స్ డ్రాఫ్టింగ్ ఆఫ్‌లైన్ నైపుణ్య ఆధారిత శిక్షణ ఆరు రోజుల కార్యక్రమం నిర్వహిస్తునట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం ద్వితీయ సంవత్సరమునకు చెందిన 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎపిఎస్ఎస్డిసి శిక్షకులు గౌతమ్, విద్యార్థులకు ఆటోకాడ్ సాఫ్ట్‌వేర్‌లో టు డి డ్రాయింగ్, లేయర్స్, ప్లాట్ కంట్రోల్స్ మరియు ఐసోమెట్రిక్ వీక్షణల రూపకల్పన వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీహరి, స్పాక్ డాక్టర్ బి. రామారావు, డిపార్ట్‌మెంట్ సమన్వయకర్త సాగర్ మరియు మెకానికల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం వ్యవహారంపై సిబిఐ విచారణ నిర్వహించాలి

- నకిలీ మద్యంపై ఎమ్మెల్యేకు ఎందుకు అత్యుత్సాహం
- బాబు శుద్ధపూస అయితే 19 కేసులు ఎందుకు.
- వైసీపీ యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్



విశాలాంధ్ర-ఆమదాలవలస: రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యాపారం వ్యవస్థీకృత నేరంగా మారిందని వైసీపీ యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ ఆరోపించారు. గురువారం ఆమదాలవలస లోని తన నివాసం లో మీడియాతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నుంచి మొలకల చెరువు వరకు వ్యాపించిన కల్తీ మద్యం నెట్‌వర్క్ ఐదు జిల్లాలకు విస్తరించి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిం దన్నారు. కల్తీ మద్యం ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థకు కొంతమంది రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని ఆయన తీవ్ర విమ ర్శలు చేశారు. తూర్పు రాయలసీమ నుండి ఉత్తరాంధ్ర వరకు ఆరు కేంద్రాలుగా ముఠా ఏర్పడి బార్‌లు, బెల్ట్ షాపులు, పర్మి ట్ రూములు వరకు నకిలీ మద్యం సరఫరా అవుతోందని తెలిపా రు. చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని టీడీపీ పాలనలో ఈ అవి నీతి బలపడి ఉందని ఆయస అన్నారు. తంబళ్లపల్లె టీడీపీ మాజీ అభ్యర్థి జై చంద్ర రెడ్డి, సురేంద్ర నాయుడు, జనార్ధన్ వంటి వ్యక్తులు ఈ నేర వ్యవస్థ వెనుక ఉన్నారు. వీరిని కాపా డినది ఇప్పటి నాయకత్వమేనని విమ ర్శించా రు. నకిలీ మద్యంపై చంద్రబాబు కానీ, సంబంధిత మంత్రి రవీంద్ర కానీ, లోకేష్ కానీ ఏ ఒక్కరూ మాట్లాడకపోయి నా స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ వైసిపి పై అబాండాలు వేస్తూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు పాలన గాడి తప్పిందని లేకుంటే ప్రభుత్వంలో ఉన్నవారు సంఘటనను దర్యాప్తు చేసి చర్యలు చేపట్టవలసిన వారు వైసీపీని విమర్శించటం తగదన్నారు. చంద్రబాబు శుద్ధ పూస కాదని ఆయనపై ఉన్న 19 కేసులు నిగ్గ తేల్చాలని డిమాండ్ చేశారు. అమరావతి భూకుంభకోణం, సింగపూర్ కంపెనీలకు ఉచిత భూసమర్పణ, మనీ ల్యాండరింగ్ వంటి అంశాలు కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్రాన్ని అవినీతి, కల్తీ మద్యం కుంభకోణాల అడ్డాగా మార్చిన చంద్రబాబు అంతర్జాతీయ స్థాయి అవినీతి నేతగా గుర్తింపు పొందారని వ్యాఖ్యానించా రు. తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియా వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజలు ఇప్పుడు అన్ని వాస్తవాలను గ్రహిస్తున్నారన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పలాస: పలాస రైల్వేస్టేషన్ రెండప ప్లాట్ ఫారం లైన్ కొత్త రైల్వే వంతెన సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మతి చెందినట్లు పలాస జి.ఆర్.పి. ఎస్ ఐ ఎ.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడుకు సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, శరీరంపై నాచురంగు గల షాట్, నీలం రంగు గల టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మరిన్ని వివరాలకై 9440627567, 9492250069 నెంబర్లుకు సంప్రదించాలని ఆయన కోరారు.

కోటి సంతకాలు సేకరణలో భాగస్వామ్యం కావాలి.

-జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్ పిలుపు.

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల సేకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని వైఎస్ఆర్సిపి జిల్లాఅధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోటిసంతకాల సేకరణలో భాగంగా వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ సమక్షంలో మండలంలో పాలతలగాం, ఎరకన్నపేట, కాకరపల్లి గ్రామాల్లో రచ్చబండ సమావేశమును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ దాస్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన ప్రజల వద్దకు వెళ్లి కోటి సంతకాలను సేకరించి గవర్నర్ కు పంపుతామని అన్నారు. రాష్ట్రప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరమవుతుందని అన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాజకీయ వివక్షత లేకుండా అర్హులందరికీ వివిధ సంక్షేమ పథకాలను అందించారని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు అందించే పథకాలకు తూట్లు పొడుచుతున్నారని ధ్వజమెత్తారు. పేదల అవసరాలను పక్కనపెట్టి చేసిన అప్పు అంతా అమరావతి రాజధాని కోసం ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి పేదవాడికి కనీస అవసరాలతో పాటు విద్య, వైద్యం ప్రధానమని అన్నారు. గ్రామ, మండల ,జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

-పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధి ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం 23 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధిని గాలికి వదలేసారని, నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, తాను మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని అన్నారు. తాను ఎమ్మెల్యేగా పదవి చేపట్టిన తర్వాత మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందించడం జరిగిందన్నారు. కాలువలో పూడికలు తీసేందుకు సుమారు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పది కోట్లు మంజూరు చేయాలని మున్సిపల్ మంత్రి నారాయణకు కోరడం జరిగిందని నిధులు మంజూరు అయిన వెంటనే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా ప్రతీ వార్డుకు నిధులు మంజూరు చేసి రోడ్లు కాలువలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ,ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, సైని వల్లభ, సవర రాంబాబు, ఎం నరేంద్ర (చిన్ని) కొత్త సత్యం, మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, డిఇ కనకరాజు ఎఇ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారాన్ని వృధాచేయకండి

- లయన్ డా. పైడి. సింధూర

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఆహారాన్ని వృధాచేయకండని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు లయన్ డా.పైడి. సింధూర అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యమహల్ దగ్గరలో గల రిక్షా కార్మికులకు, దినసరి కూలీలకు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని అందించారు. అధ్యక్షురాలు సిందూర మాట్లాడుతూ ప్రపంచ ఆహారాన్ని దినోత్సవాన్ని పురస్కరించుకొని, జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ సహకారంతో నగరంలో పలు చోట్ల, నిస్సహాయులకు ఆహారాన్ని అందించడం ఆనందంగా ఉందని, ఆకలి, పోషకాహార లోపం, ఆహార భద్రతపై అవగాహనను ప్రపంచవ్యాప్తంగా కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. మంచి జీవితం, మంచి భవిష్యత్తు కోసం.. ఆహారం అందించడమనే లక్ష్యంగా ఈ ఏడాది లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ హంగర్ అంశం లో భాగంగా అన్నవితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గాలి, నీరు తర్వాత ప్రాథమిక అవసరమైనది ఆహారమేనని, ప్రపంచంలో బిలియన్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైనఆహారాన్ని పొందలేకపోతున్నారన్నారు. అనారోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల పోషకాహార లోపం ఏర్పడుతుందన్నారు. జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ రైతులు ప్రపంచ జనాభా కంటే ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నారని, కొరత మాత్రం అలాగే కొనసాగుతోందని, చాలామంది ఆకలితో అలమటిస్తున్నారన్నారు. వాతావరణంలో మార్పులు, ఆర్థికమాంద్యం, కొవిడ్ వంటి మహమ్మారుల సమయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఆకలి సమస్యలను ఎదుర్కొన్నారని, ముఖ్యంగా ఇవి పేదలు, బలహీన వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షులు డా.బొగెల ఉమామహేశ్వర రావు, ఉర్లం శివతేజ పట్నాయక్, కార్యదర్శి టెక్కం రామ్ గోపాల్, సభ్యులు చౌదరి శ్రీనివాస్, మానవత సంస్థ పూర్వపు కార్యదర్శి టి. శ్రీనివాస రావు, రిక్షా కార్మిక యూనియన్ సభ్యుల బృందం పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో జిఎస్ టి.

విశాలాంధ్ర-పలాస: సామాన్యులకు అందుబాటులో అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జిఎస్.టి. రూపకల్పన జరిగిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం స్థానిక మేధా స్కూల్ ఆవరణలో రోడ్డు రవాణాశాఖ ఆధ్వర్యంలో జి ఎస్టీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు ఆటోలతో నిర్వహించిన ర్యాలీని ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిఎస్ టి తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలు కొనుగోలు శక్తి పెరగిందన్నారు. జిఎస్ టి వలన వినియోగదారులతో పాటువిక్రయదారులు లబ్దిపొందుతున్నారని మేధావుల అలోచనలతో నూతన జిఎస్ టి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. 8 నెలల పాటు ఆర్థిక, నిపుణులు, శాస్త్రవేత్తలు ఆలోచనలు చేసి జిఎస్ టి ద్వారా ధరలు తగ్గించేందుకు ఆలోచనలు చేశారన్నారు. జిఎస్ టి ధరలను తగ్గించే విషయాన్ని గ్రామ, గ్రామాలలో ప్రజలకు ఆవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావు, పలాస నియోజకవర్గ జి ఎస్టీ ప్రత్యేక అధికారి మధుసూదనరావు, పలాస రవాణా శాఖ అధికారి కె శ్రీనివాసరావు, జి ఎస్టీ అధికారి రాము, మేధా పాఠశాల కరస్పాండెంట్ సోమేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఐడీలు త్వరగా క్రియేట్ చేయాలి

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలంలో నూతనంగా జాయిన్ అయిన ఉపాధ్యాయులకు ఐడీలు త్వరగా క్రియేట్ చేసి జీతాలు వీలైన త్వరగా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలి కోరుతూ ఎంఆర్సి వద్ద మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జికి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళి ప్రకాష్, మండల యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకో ఉపాధ్యాయ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సెలవులు విషయంలో తగు చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు అవసరమైన చోట సర్దుబాటు చేయాలని వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎస్ కో కన్వీనర్ జానకిరావు, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కే.రామారావు, సూర్యం, సందీప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.